క్లుప్తంగా

తెగుళ్లపై జాగ్రత్తలు పాటించాలి

పెండ్లిమర్రి : వరి పంట సాగు చేసిన రైతులు తెగుళ్లపై ముందు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయాధికారి ఓబులేసు తెలిపారు. మంగళవారం నందిమండలం గ్రామ పొలాల్లో సాగు చేసిన వరి పంటను ఆయన పరిశీలించి మాట్లాడారు. వరి పంటకు ప్రస్తుతం కాండం తొలుచు పురుగు ఆశించింది. వాటి నివారణకు ప్రొఫినోఫాస్ ఒక లీటరు నీటికి రెండు ఎంఎల్ కలిపి పిచికారి చేయాలన్నారు. పంట సాగు చేసిన ప్రతి రైతులు పంట నమోదు తప్పనిసరిగా చేయించాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ గణేష్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

అంకాలమ్మా.. దీవించమ్మా

తొండూరు : మండలంలోని సంతకొవ్వూరు గ్రామంలో వెలసిన అంకాలమ్మతల్లి దేవస్థానంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున అమ్మవారికి పూజలు నిర్వహించి ఇప్పటి నుంచి వచ్చే దసరా పండుగ వరకు 41రోజుల పాటు అఖండ జ్యోతిని వెలిగించి సకాలంలో వర్షాలు పడి గ్రామంలో పాడిపంటలు బాగా పండి రైతులు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం స్థానిక ఆలయంలో అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల పరిశీలకులు బండి రామమునిరెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

తుఫాన్ ప్రభావిత ప్రాంతాలకు సహాయక బృందాలు

సింహాద్రిపురం : మండలం నుంచి విజయవాడ, తదితర తుఫాన్ ప్రభావిత ప్రాంతాలకు సహాయక చర్యలు చేపట్టడానికి పంచాయతీ సెక్రటరీ హరికిరణ్ ఆధ్వర్యంలో బృందాలను పంపించామని ఎంపీడీవో కృష్ణమూర్తి, ఈఓపీఆర్డీ పద్మనాభరెడ్డిలు తెలిపారు.

పరామర్శ



మొద్దీన్‌బాషాను పరామర్శిస్తున్న రవీంద్రనాథ్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె : మండల వైఎస్సార్ సీపీ మైనారిటీ కన్వీనర్ మొద్దీన్‌బాషా అనారోగ్యంతో కడప నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న కమలాపురం మాజీ ఎమ్మెల్యే, కడప జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి మంగళవారం ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడా ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర మాజీ సోషల్ వెల్ఫేర్ అధ్యక్షుడు పులి సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా జరగకుండా చూడాలి

కొండాపురం : ఇసుక పాయింట్ల వద్ద అక్రమంగా ఇసుక రవాణా జరగకుండా చూడాలని అధికారులను ఆర్డీఓ శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం మండలంలోని ఏటూరు, పి.అనంతపురం ఇసుక స్టాక్ పాయింట్లను ఆర్డీఓ, తహసీల్దార్ మాదవ కృష్ణారెడ్డిలు పరిశీలించారు. కె. సుగుమంచిపల్లె చెక్‌పోస్ట్ వద్ద అక్రమ వసూళ్లు చేస్తున్న ఇద్దరి కానిస్టేబుళ్లపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీకి నివేదిక పంపామన్నారు. ఇసుక రవాణలో అక్రమాలు మా అధికారులు చేయలేదన్నారు. కార్యక్రమంలో సర్వేయర్ డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వరి, ఆర్ఐ ఇన్‌చార్జి అనంద్, సిబ్బంది పాల్గొన్నారు

భూసార పరీక్షల తర్వాత పంట సాగుచేయాలి

జమ్మలమడుగు : రైతులు తమ భూములకు సంబంధించి భూసార పరీక్షలు చేయించుకున్న తర్వాతనే పంట సాగు చేయాలని ఏఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం గూడెంచెరువు గ్రామంలో సంపూర్ణత అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. భూమి పరిస్థితిని తెలుసుకున్న తర్వాత పంట సాగు చేసుకోవాలన్నారు. అనంతరం రైతులకు భూసార పరీక్ష పత్రాలను అందించారు. కార్యక్రమంలో వీఏఏ శివశంకర్, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామోత్సవం

పులివెందుల టౌన్ : త్రైత సిద్ధాంతం–ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక పులివెందుల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం శ్రీకృష్ణ పరమాత్ముని ర్యాలీ ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుని జన్మాష్టమి వేడులలో భాగంగా ఈ ర్యాలీ స్థానిక అంకాలమ్మ ఆలయం వద్ద నుంచి పార్నపల్లెరోడ్డు, పూలంగళ్ల సర్కిల్, ముత్యాలవారివీధి, అమ్మవారిశాల, మెయిన్‌బజార్, ఆర్టీసీ సర్కిల్ మీదుగా నిర్వహించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో రథాన్ని లాగుతూ గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గోపీనాథ్, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల ప్రబోద సేవా సమితి సభ్యులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

నీట మునిగిన పంటల పరిశీలన

పెద్దముడియం : నాలుగు రోజుల నుంచి కుందూ నదికి భారీగ వరద నీరు రావడంతో నదీ పరీవాహక గ్రామాల ప్రజలు సాగు చేసిన వరి, కంది, మినుము పంటలు నీట మునిగాయి. దీంతో విషయం తెలుసుకున్న మండల వ్యవసాయాధికారి అరుణ మంగళవారం నెమళ్లదిన్నె గ్రామం వద్ద సాగు చేసిన పంటలను పరిశీలించి మాట్లాడారు. పంట పొలాల నుంచి వరద నీరు అంతా వెళ్లిపోయిందని ఏదైనా పంటలకు నష్టం జరిగిఉంటే ఉన్నతాధికారులకు తెలియజేస్తామని తెలిపారు.

పౌష్టికాహారంతోనే రక్తహీనత నివారణ

వేంపల్లె : మహిళలు, బాలింతలు, గర్భిణులు, పిల్లలు రక్తహీనత బారిన పడకుండా మంచి పౌష్టికాహారం తీసుకోవాలని వేంపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ వి.సునీత తెలిపారు. మంగళవారం ఇడుపులపాయలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సావాలను ఆమె ప్రారంభించి అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు ఈనెల 1 నుంచి 30వ తేదీ వరకు ప్రతి గ్రామంలో సమతుల్యత ఆహారం పట్ల అవగాహన కల్పిస్తూ పౌష్టికాహార మాసోత్సావాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐరన్ సాంద్రత ఎక్కువగా ఉన్న కూరగాయలు, ఆకు కూరలు, జొన్నలు, గుడ్లు, మాంసాహార పదార్థాలు, బెల్లం, ఖర్జూరం వంటి వాటిని మనం తీసుకునే ఆహారంలో ఉండేలా ప్రతి ఒక్కరూ అవగాహన కలిగిఉండాలన్నారు. కౌమర దశ నుండే ఆడపిల్లలకు రక్తహీనత రాకుండా ఉండేందుకు ఆయా పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐరన్, ఫోలిక్ యాసిడ్ సిరఫ్‌లను ప్రభుత్వం అందిస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వర్ణలత, ఉపాధ్యాయులు శంకర్‌రెడ్డి, మహిళా పోలీసు వర్ధిని, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ సునీత

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : అంకాలమ్మ గూడూరులోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పౌష్టికాహార మాసోత్సవాలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసంత ప్రారంభించి మాట్లాడారు. ఈనెల 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ప్రతి గ్రామంలో పౌష్టికాహార మాసోత్సావాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కిశోర బాలికలకు, గర్భిణులకు, బాలింతలకు రక్తహీనతపై అవగాహన కల్పించి ప్రతి ఒక్కరు ఆకుకూరలు, కూరగాయలు, పప్పుదినుసులు తీసుకోవాలని సూచించారు.

ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

వేముల : ఆరోగ్యం పట్ల గర్భిణులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హసీనా తెలిపారు. మండలంలోని బెస్తవారిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పౌష్టికాహార మాసోత్సవాన్ని పురస్కరించుకుని తల్లులకు, కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ప్రతీరోజు ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు, పప్పు ధాన్యాలు తీసుకోవాలన్నారు. పిల్లల వయసుకు తగినట్లుగా ఎత్తు, బరువు ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పాల్గొన్నారు.



వేముల : పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హసీనా



సింహాద్రిపురం : పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసంత

కార్లను తొలగించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

పులివెందుల రూరల్ : పట్టణంలోని శ్రీరామా హాల్ సమీపం మసీదు పక్కన ఉన్న కూరగాయల మార్కెట్‌ను స్థానికులు కార్లస్టాండుగా మార్చుకున్నారు. ఈ విషయంపై సాక్షి పత్రికలో వాహనాలకు స్టాండుగా తలపిస్తున్న మార్కెట్ అనే వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన సంబంధిత అధికారులు మంగళవారం కూరగాయల మార్కెట్‌లో ఉంచిన వాహనాలను తొలగించారు. వ్యాపారస్తులు వ్యాపారాలు చేసుకునే విధంగా అవకాశం కల్పిస్తామన్నారు. వాహనదారులు ఎవరూ ఇక్కడ వాహనాలను ఉంచరాదన్నారు.

రోడ్లపై పశువులు కనిపించకూడదు

జమ్మలమడుగు : మున్సిపాలిటీ పరిధిలోని వీధులలో ఈనెల 14 నుంచి పశువులు రోడ్లపైన తిరగకుండా చూసుకోవలసిన బాధ్యత వాటి యజమానులదే అని మున్సిపల్ కమిషనర్ ఎస్.ప్రమోద్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లపైన ఆవులు, పందులు ఎక్కువగా తిరుగుతుండటంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. 14వ తేదీ తర్వాత రోడ్లపైన పశువులు కనిపిస్తే చట్టబద్ధమైన చర్యలను తీసుకుంటామన్నారు. పశువుల యజమానులు గమనించాలన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ అధికారి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు అన్నదానం



భోజన పాకెట్లు అందిస్తున్న విజయ్‌బాబు

కమలాపురం : పట్టణ పరిధిలోని రైల్వేస్టేషన్, బస్టాండు, క్రాస్ రోడ్డు తదితర ప్రాంతాల్లో రోడ్లపై ఉన్న నిరాశ్రయులు, భిక్షాటన చేసే వారికి అన్నదానం చేయడం సంతోషంగా ఉందని అభి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎస్.విజయ్‌బాబు తెలిపారు. మంగళవారం బైబిల్ వండర్స్ అధినేత జాన్ వెస్లీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉన్న నిరాశ్రయులకు అయన భోజన పాకెట్లు అందజేశారు. రాజమండ్రి తదితర ప్రాంతాల్లో జాన్‌వేస్లీ ఫౌండేషన్ ద్వారా వేలాది మందికి సహాయ సహకారాలు అందుతున్నాయని ఆయన సేవలను కొనియాడారు. జాన్‌వెస్లీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని పేద ప్రజలకు అన్నదానం చేయడం గొప్ప విషయం అన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు సునీల్, లక్ష్మణ్, పండు తదితరులు పాల్గొన్నారు.

ఇ–కేవైసీ తప్పనిసరిగా నమోదు చేయాలి



నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి రమేష్



యు.రాజుపాలెంలో తనిఖీ చేస్తున్న మండల వ్యవసాయశాఖ అధికారి శ్యామ్‌బాబు

లింగాల : ఖరీఫ్ 2024లో సాగు చేసిన ప్రతి పంటకు పంట నామోదు అయిన ప్రతి రైతు సంబంధిత రైతు సేవ కేంద్రంలో ఇకెవైసీ (వేలిముద్ర) నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రమేష్ తెలిపారు. మంగళవారం బోనాల, కామసముద్రం పెద్దకూడాల రైతు సేవాకేంద్రం పరిధిలో జరుగుతున్న పంట నమోదుతో పాటు ఇకెవైసీ నమోదు ప్రక్రియను అయన పరిశీలించి మాట్లాడారు. పంట నమోదు ఆధారంగానే రైతులకు పంటల బీమా, పంట నష్ట పరిహారం, వడ్డీలేని పంట రుణాలు మొదలైన పథకాలకు అర్హులవుతారన్నారు. అలాగే పంట నమోదులో ఎలాంటి అవకతవకలు లేకుండా చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : పంటలు సాగు చేసిన ప్రతి రైతు తప్పనిసరిగా ఇ–కేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి శ్యామ్‌బాబు తెలిపారు. మంగళవారం మండలంలోని మొయిళ్లచెరువు, యు.రాజుపాలెం గ్రామాల్లో నిర్వహిస్తున్న ఇ–కేవైసీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. మండలంలో ఇప్పటి వరకు 2865 మంది రైతులకు సంబంధించి 10,039 ఎకరాల్లో పంట నమోదు చేశారన్నారు. వీరిలో కేవలం 488 మంది రైతులు మాత్రమే ఇ–కేవైసీ చేయించుకున్నారన్నారు. లేకపోతే ప్రభుత్వ రాయితీలు అందవన్నారు.

వైవీయూ ఇన్‌చార్జి వీసీ అచార్య కృష్ణారెడ్డిని తొలగించాలి

వేంపల్లె : అవినీతి అక్రమాలకు పాల్పడిన వైవీయూ ఇన్‌చార్జి ఉపకులపతి ఆచార్య కృష్ణారెడ్డిని తొలగించాలని ఏఐవైఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ బ్రహ్మం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ వైవీయూలో పనిచేస్తున్న ఆచార్య కృష్ణారెడ్డి విశ్వవిద్యాలయంలో అనేక లైంగిక వేధింపులకు పాల్పడ్డారన్నారు. విద్యార్థులను తన ఇంటిపని, వ్యక్తిగత పనులకు వాడుకోవడంతోపాటు ఫెలోషిప్‌లో కూడా తన కక్కుర్తిని ప్రదర్శించేవాడన్నారు. తన రాసలీలలు గుట్టు చప్పుడు కాకుండా కొనసాగించేవాడనన్నారు. ప్రిన్సిపాల్‌గా ఉన్నప్పుడు ఓ మహిళా ఉద్యోగిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం, కాల్ రికార్డులు బయటికి రావడంతో ఆయన కామక్రీడలన్నీ బయటపడ్డాయన్నారు. ఆ సందర్భంలో ఆయన్ను ప్రిన్సిపాల్‌గా తొలగించారన్నారు. అయితే మళ్ళీ ప్రిన్సిపాల్ పదవిని కట్టబెట్టారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విశ్వవిద్యాలయ ఉపకులపతులు రాజీనామా చేయడంతో ఇతనిని ఇన్‌చార్జి వీసీగా నియమించారన్నారు. ఉన్నత, రాజ్యాంగ పదవులకు విద్యార్హతే సరిపోదని వ్యక్తిత్వం కూడా ముఖ్యమన్నారు. తక్షణమే అతన్ని తొలగించి రెగ్యులర్ వీసిని నియమించే వరకు హయ్యర్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఇన్‌చార్జిగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు అల్లాబాషా, జయచంద్ర, విష్ణు, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు పాటించండి



గొళ్లపల్లెలో వరి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ

కమలాపురం : రైతులు తాము సాగు చేసిన పంటల్లో సస్యరక్షణ చర్యలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని జంభాపురం, గొళ్లపల్లె గ్రామాల్లో సాగుచేసిన వరి పంటను అయన పరిశీలించారు. వరి పంటకు బ్యాక్టీరియా, ఆకు ఎండు తెగులు ఆశించిందని గుర్తించారు. దాని వలన ఆకుల అంచులు, వడలి ఆకులు ఎండి పోతాయని రైతులకు తెలిపారు. బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు నివారణకు నత్రజని ఎరువుల వాడకాన్ని తగ్గించాలన్నారు. సాయంత్రం వేళల్లో ఏకరాకు 20 కేజీల పొటాష్ ఎరువును వేసుకోవాలన్నారు. అలాగే పంట పొలాలను ఆరబెట్టాలన్నారు. వాతావరణం మార్పు అనంతరం ఎండ వచ్చిన తర్వాత పంట సాధారణస్థాయికి వస్తుందన్నారు. అలాగే వరి పంటలో జింకు లోప లక్షణాలు కూడా ఉన్నాయని, తద్వారా ఆకులకు ఇటుక రంగు మచ్చలు ఏర్పడి ఆకులను తుంచినా, తగిలిన పెలుసుగా విరిగిపోతాయన్నారు. దీని నివారణకు చిలేటెడ్ జింక్ సల్ఫేట్ 2 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ దస్తగిరి, వీఏఏ మహేశ్వర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

మైలవరం దక్షిణ కాలువకు నీరు విడుదల చేయాలి



కమలాపురం చెరువును పరిశీలిస్తున్న ఎంవీ సుబ్బారెడ్డి

కమలాపురం : మైలవరం దక్షిణ కాలువకు నీరు విడుదల చేసి కమలాపురం చెరువును నింపాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు ఇల్లూరి కృష్ణారెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి నాగేశ్వర్‌రావు తదితరులతో కలసి ఎండి పోయిన కమలాపురం చెరువును ఆయన పరిశీలించి ఆవేదన వ్యక్తం చేశారు. ఖరీఫ్‌లో ఏర్పడిన వర్షాభావ పరిస్థితుల కారణంగా పాపాఘ్ని నది ప్రవహించక పోవడంతో కమలాపురం చెరువు ఎండిపోయిందన్నారు. చెరువు ఆయకట్టు రైతులు, ప్రజలు సాగు, తాగు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్ట్‌లు నీటితో కళకళ లాడుతున్నాయన్నారు. రేపో మాపో శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి గాలేరు నగరి ద్వారా గండికోట రిజర్వాయర్‌లోకి నీరు వస్తుందన్నారు. అక్కడి నుంచి మైలవరంకు 5 టీఎంసీల నీరు విడుదల చేసి, ఆ ప్రాజెక్ట్ నుంచి దక్షిణ కాలువకు నీరు విడుదల చేసి కమలాపురం చెరువును నింపాలన్నారు. కమలాపురం చెరువు పరిధిలోని అక్కంపేట, మీరాపురం, సి.గోపులాపురం, పాచికలపాడు, పుట్లంపల్లె, కమలాపురంకు చెందిన 3వేల ఎకరాల ఆయకట్టు ఉందన్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులు స్పందించి మైలవరం దక్షిణ కాలువకు నీరు విడుదల చేసి కమలాపురం చెరువును నింపాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానిక రైతులు శివారెడ్డి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ధరలను అదుపు చేయడంలో ప్రభుత్వాలు విఫలం



ఏఓకు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

జమ్మలమడుగు : పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సీపీఐ నాయకుడు ప్రసాద్ తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధరలను తగ్గించాలని నిరసన వ్యక్తం చేశారు. కేంద్రం, రాష్ట్రంలో ప్రభుత్వాలు ఏర్పడి దాదాపు వందరోజులు కావస్తోంది. వారు ఇచ్చిన ఒక్క హామీలు కూడా అమలు కాలేదన్నారు. మార్కెట్‌లో బియ్యం, కందిపప్పు, చింతపండు వంటి నిత్యావసర వస్తువులు రోజురోజుకు పెరిగిపోయాయన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ధరలను తగ్గించాలంటూ ఆర్డీఓ కార్యాలయ ఏఓ తిరుపతయ్యకు వినతిపత్రం అందజేశారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

జమ్మలమడుగు రూరల్ : నిరుద్యోగ యువతి, యువకులు జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సురేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ ఆధ్వర్యంలో జాబ్ మేళాను నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతినెల జిల్లాలోని ప్రతి ఒక్క నియోజకవర్గంలో జాబ్ మేళాను నిర్వహిస్తారన్నారు. ఈ జాబ్ మేళాకు 3 కంపెనీ సంస్థల ప్రతినిధులు హాజరైనట్లు తెలిపారు. ఐటీఐ, 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ అర్హతతో మొత్తం 141 మంది విద్యార్థులు హాజరు కాగా అందులో 76 మంది ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఎంపికైన వారికి రూ.13 వేల నుంచి రూ.25 వేల వరకు జీతం ఉంటుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సురేంద్రనాథ్‌రెడ్డి

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి

పులివెందుల టౌన్ : మాదిగ ఉపకులాల కులగణాంకాల సేకరణతోనే ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్యమాదిగ అన్నారు. మంగళవారం పులివెందులలోని మిట్టమల్లేశ్వరస్వామి కల్యాణ మండపంలో కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇటీవల ఆగస్టు 1న సుప్రీంకోర్టు ఏడుగురు జడ్జీలతో కూడిన ధర్మాసనం వర్గీకరణ చేసుకునే అధికారం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందని తీర్పును ఇచ్చిందన్నారు. అయితే భవిష్యత్తులో వర్గీకరణకు అడ్డంకులు లేకుండా ప్రభుత్వాలు చూడవలసిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. సమావేశంలో ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడే రామయ్యగారి కృష్ణమూర్తి, డప్పు చర్మకారుల రాష్ట్ర కన్వీనర్ నాగభూషణం మాదిగ, కాంట్రాక్టు ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ శివరాం, జిల్లా ఉపాధ్యక్షుడు సహదేవుడు, జిల్లా కార్యదర్శి పుల్లయ్య, ప్రొద్దుటూరు మండల కన్వీనర్ బాలనరసింహులు, ఎర్రగుంట్ల మండల అధ్యక్షుడు రామాంజనేయులు, ఉపాధ్యక్షుడు రామయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని నినాదాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

15లోపు వలంటీర్లకు జీతాలు చెల్లించాలి

జమ్మలమడుగు : రాష్ట్ర ప్రభుత్వం వలంటీర్లకు ఈనెల 15లోపు జీతాలను చెల్లించకపోతే పోరాటం చేస్తామని సీపీఐ నాయకుడు మిడతల ప్రసాద్ తెలిపారు. మంగళవారం స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో వలంటీర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వలంటీర్లకు ప్రతినెల రూ.10వేలు జీతం ఇస్తామని ప్రకటించారు. ప్రభుత్వం ఎర్పడి మూడు నెలలు అవుతున్నా ఇంత వరకు వలంటీర్లను పట్టించుకోవడంలేదు. వారికి ప్రతినెల రూ.10 వేలు జీతం ఇస్తామన్న మాట నిలబెట్టుకోవాలన్నారు. లేకుంటే సీపీఐ ఆధ్వర్యంలో వలంటీర్లతో కలిసిపోరాటం చేస్తామని హెచ్చరించారు.

మలేరియాపై అవగాహన



మాట్లాడుతున్న సబ్‌యూనిట్ అధికారి సిద్ధయ్య

పులివెందుల రూరల్ : పులివెందుల అర్బన్ ప్రాథమిక అరోగ్య కేంద్రంలో మంగళవారం మలేరియా రక్త పూతలు తీయు విధానం, వెక్టర్ కంట్రోల్, ఫ్రైడే–డ్రైడే గురించి ఆరోగ్య కార్యకర్తలకు అవగాహన కల్పించినట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య తెలిపారు. ఆరోగ్య కార్యకర్తలు ప్రతి గ్రామాన్ని సందర్శించి జ్వరం ఉన్న వారికి రక్తపూతలు సేకరించి వారానికి మూడు సార్లు ల్యాబ్‌కు అందజేయాలన్నారు. మలేరియా నిర్ధారణ అయితే వెంటనే చికిత్స అందించాలన్నారు. ఆ గ్రామంలో ఫీవర్ సర్వే, లార్వా సర్వే, దోమల నివారణ కొరకు సైఫోనోత్రిన్ పిచికారీ చేసి, గ్రామంలోని ప్రజలందరికీ రక్తపరీక్షలు చేయించాలన్నారు. కార్యక్రమములో నగరిగుట్ట వైద్యాధికారి డాక్టర్ స్నేహప్రత్యూష, డాక్టర్ శాంతికుమార్, డి.పి.ఎం.ఓ. సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వినాయకుని విగ్రహాలకు అనుమతి తప్పనిసరి



మాట్లాడుతున్న సీఐ నాగరాజు

వేముల : మండల వ్యాప్తంగా గ్రామాల్లో వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సీఐ నాగరాజు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం వినాయక కమిటీ నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విగ్రహాలు కొలువుతీరినప్పటి నుంచి నిమజ్జనం పూర్తి అయ్యేవరకు నిర్వాహకులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏవైనా సంఘటనలు జరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. విద్యుత్, ఫైర్ అధికారుల అనుమతి కూడా తీసుకోవాలన్నారు. గ్రామంలో నిమజ్జనం జరిగే రూట్ మ్యాప్‌ను అనుమతి తీసుకునే ముందు పోలీసు సిబ్బందికి తెలిపాలన్నారు. అనుమతి తీసుకోకుండా విగ్రహాలను ఏర్పాటుచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ప్రవీణ్ కుమార్, పలు గ్రామాలకు చెందిన వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

ముగిసిన భాగవత పఠనం

సింహాద్రిపురం : పైడిపాలెం రిజర్వాయర్ సమీపంలో లావనూరు–చవ్వారిపల్లె మార్గంలో ఉన్న శ్రీ శివసాయి అనాథ ఆశ్రమంలో వారంరోజులుగా జరుగుతున్న భాగవత పఠనం మంగళవారం ముగిసింది. అనాథఆశ్రమం ట్రస్టు ఆధ్వర్యంలో కడప, అనంతపురం జిల్లాల భాగవత భక్త సమాజంల పర్యవేక్షణలో కొనసాగింది. మంగళవారం శ్రీ కృష్ణుడికి పంచామృతాభిషేకం, తదితర పూజలు నిర్వహించారు. అనంతరం ఆశ్రమం చూట్టూ కలశ ప్రదర్శన నిర్వహించారు. చవ్వారిపల్లె గ్రామానికి చెందిన కే.శే.సాంబశివారెడ్డి కుటుంబీకులు అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం భాగవత పండితులను సన్మానించారు. ట్రస్టు నిర్వాకులు శ్రీలత, భాగవతం సమాజం అధ్యక్షుడు నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రక్త హీనత నివారణకు కృషి చేయాలి

వల్లూరు : రక్త హీనతను నివారించడానికి ఆశా కార్యకర్తలు పూర్తిస్థాయిలో కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి నాగరాజు తెలపారు. వల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జరిగిన ఆశా కార్యకర్తల సమావేశంలో అయన పాల్గొని మాట్లాడారు. ఆశా కార్యకర్తలు గర్భిణుల వివరాలను 100 శాతం నమోదు చేయాలన్నారు. పోషణ్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ పోషకాహారం తీసుకోవాల్సిన ఆవశ్యతను గురించి అవగాహన కల్పించాలన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా ఈనెల 17వ తేదీన ప్రతి స్కూలు, అంగన్‌వాడీ కేంద్రాలలో 19 సత్సరాలలోపు పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలను మింగించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గణాంకాధికారి రమేష్‌రెడ్డి, ఐడీఎస్‌పీ అధికారి ఖాజామొద్దీన్, పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఫణీంద్ర, ఎమ్‌పీహెచ్ఈవో ప్రసాద్, సీహెచ్‌వో వేణుగోపాల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి నాగరాజు

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

పులివెందుల టౌన్ : విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలని ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 2024 విద్యా సంవత్సరంలో అడ్మిషన్ పొందిన విద్యార్థినుల తల్లిదండ్రులకు నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల యొక్క హాజరు పట్టి వివరాలు ఎప్పటికప్పుడు మీకు తెలియజేస్తామన్నారు. పి.ఆర్.ఒ. బాలనారాయణ విద్యార్థులకు హాస్టల్ వసతులను కల్పించడానికి సహకారం అందిస్తామన్నారు. సెల్ ఫోన్లను అవసరమైన మేరకే వాడాలన్నారు. విద్యార్థులు వివిధ రకాల ప్రాజెక్టులను చేయాలంటే సెల్ ఫోన్ వాడకం తప్పనిసరి అన్నారు. సమావేశంలో సిప్ కోఆర్డినేటర్ విజయలక్ష్మి, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసులు

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి

తొండూరు : స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ప్రధానమంత్రి యోజన ప్రోగ్రాం కింద సోలార్ రూఫ్ టాప్ టెక్నీషియన్ ట్రైనింగ్ కింద 7 రోజులు స్వల్పకాలిక ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు ఐటీఐలో ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్, మెకానిక్ ట్రేడుల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులన్నారు. వివరాలకు 9010070333ను సంప్రదించాలని ఆయన తెలిపారు.